క్లుప్తంగా

నేడు గాజుల అలంకరణలో భద్రకాళి

రాయచోటి టౌన్: నేడు శ్రీ భద్రకాళి అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిలు తెలిపారు. శుక్రవారం అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహిస్తారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడా కిట్లు పంపిణీ

రాయచోటి టౌన్: ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు డీఎస్డీఓ చంద్రశేఖర్, ఎంపీడీఓలు ఇద్దరు క్రీడా కిట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆరు నియోజకవర్గాలకు చెందిన క్రీడాకారులకు ఈ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ ఆడుదాం ఆంధ్రా ఆటలో పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీసీఈబీ చైర్మన్ నాగమునిరెడ్డి, పీడీలు నరసరాజు, వీరాంజనేయులు, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కమిటీ ఎన్నిక

చిట్వేలి : మండల యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఎన్నిక గురువారం స్థానిక ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో ఏకగ్రీవంగా జరిగింది. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.హరిప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో మండల గౌరవ అధ్యక్షులుగా కె.మనోహర బాబు, అధ్యక్షురాలిగా రమాదేవీ, ప్రధాన కార్యదర్శిగా నాగూరు రవి, సహాధ్యక్షులుగా లక్ష్మీదేవి, శ్యామూల్, ట్రెజరర్‌గా నాగేంద్ర ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు గ్రామోత్సవం

రాజంపేట రూరల్ : పట్టణ శివార్లలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ 17వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.పాలప్రకాష్, ఆర్.వెంకటేశ్వరరెడ్డిలు గురువారం తెలియజేశారు. ఉదయం అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నట్లు తెలియజేశారు. భక్తులు పాలు, పెరుగు, నెయ్యి, చెక్కర, గంధం, విభూది, వంటి పదార్థాలను తీసుకురావాలన్నారు. సాయంత్రం 5గంటల నుంచి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

మాలధారులకు అన్నదానం

రామాపురం : అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హరిహర ఆలయంలో అయ్యప్ప స్వామి భక్తులకు అన్నదానం నిర్వహించారు. పవిత్రమైన కార్తీక మాసంలో కఠోర దీక్ష చేపడుతున్న మాలధారులు నిత్యం భక్తి భావానలో ఉంటారన్నారు. ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెంపొందించుకోవలన్నారు. కార్యక్రమంలో మాలధారులు రమణయ్య, సుబ్బరాయుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

రాయచోటి అర్బన్ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని డైట్ కళాశాలలో పీఏసీఎస్, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించబడ్డాయి. పోటీలో మొత్తం 23 మంది పాల్గొనగా న్యాయనిర్ణేతలు విజేతలుగా ముగ్గురిని ఎంపిక చేశారు. పట్టణానికి చెందిన హనీకి మొదటి బహుమతిగా రూ. 1111, సఫియా మెహరూన్‌కు రెండవ బహుమతిగా రూ. 777, చంద్రకళకు మూడవ బహుమతిగా రూ. 555లను డైట్ కళాశాల ప్రిన్సిపల్ అజయ్‌కుమార్‌ల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్, లయన్స్‌క్లబ్ సభ్యులు, డైట్ కళాశాల సిబ్బందిలు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

రాజంపేట : విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడవద్దని, ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని రాజంపేట డీఎస్పీ చైతన్య అన్నారు. గురువారం ఏఐటీఎస్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. జూనియర్ విద్యార్థులు, సీనియర్ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీనియర్స్ సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. విద్యతోపాటు క్రీడలలోనూ రాణించాలన్నారు. ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందించే ఉద్దేశంతో ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి ఏఐటీఎస్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కలిగి వుండాలన్నారు. కార్యక్రమంలో డా.మల్లికార్జునరావు, డీన్ ఆఫ్ అకాడమిక్ డా.సుబ్బారావు, హెచ్‌ఓడీలు, డీన్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

రామాపురం : డిసెంబర్ 9వ తేదీలోపు ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయంలో, బీఎల్ఓల ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ అరవింద్ కిషోర్ తెలిపారు. గురువారం మండలంలోని రాచపల్లెలో ఓటు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ డిసెంబర్ 2, 3వ తేదీలలో పోలీస్ కేంద్రాలలో బూత్ లెవల్ అధికారులు ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల మీద ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. యువతీయువకులు కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం

- మాట ఇస్తే వైఎస్ కుటుంబం వెనక్కు వెళ్లదు
- గ్యారెంటీ లేని ప్రతిపక్షాల మాటలను విశ్వసించవద్దు
- రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


సిద్దవటం: వైఎస్ఆర్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, నాయకులు

సిద్దవటం: వైఎస్సార్ కుటుంబం ప్రజలకు ఏదైనా చేస్తామంటే చేసి తీరుతారని, మాట తప్పని, మడమ తిప్పని కుటుంబమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం స్థానిక సర్పంచ్ మేరువ బాలాజీ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడా ముఖ్య అతిథిగా విచ్చేసి సంక్షేమ డ్యాష్ బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు ఉచిత వైద్యం అందేలా ఏర్పాటు చేశారన్నారు. తండ్రి బాటలో పయనిస్తూ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను సీఎం జగన్ ప్రవేశపెట్టారన్నారు. చదువులకు వైఎస్ జగన్ ప్రాధాన్యతనిస్తున్నట్టు మరే ముఖ్యమంత్రి ఇవ్వలేదన్నారు. ప్రతిపక్షాల మాటలను నమ్మవద్దని, భవిష్యత్ గ్యారెంటీ అని ప్రజల వద్దకు వెళ్లి తప్పుడు ప్రచారం చేసేవారిని తిప్పి కొట్టాలన్నారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా, తనను రాజంపేట ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని మేడా కోరారు. కార్యక్రమలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, మల్లీశ్వరి, ఎంపీటీసీలు శివయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, పార్టీ నాయకులు జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, మేకపాటి అయ్యవార్‌రెడ్డి, కనపర్తి సుబ్బారెడ్డి, ఈశ్వరయ్య, కె.వి. సుబ్బయ్య, రావులసుబ్బారెడ్డి, క్రిష్ణ, సర్పంచ్‌లు శ్రీకాంత్, జానకిరామయ్య, నరసింహారెడ్డి, ప్రతాప్, వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, కెవి. సుబ్బారెడ్డి, అనీల్‌కుమార్‌రెడ్డి, వెంకట్, టి.వి. సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమం

నందలూరు(రాజంపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ముంగిటకే సంక్షేమం నడుచుకుంటూ వెళ్లిందని నందలూరు మండలాధ్యక్షుడు మేడా వియభాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వైసీ పల్లెలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక టీడీపీ అసత్య ఆరోపణలు చేస్తోందని, వీటిని ప్రజలు ఎవరు నమ్మరన్నారు. ప్రతి ఇంటిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లబ్ధిదారుడు ఉన్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా పాలన కొనసాగించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు అండగా ఉంటారనే నమ్మకం అందరిలో ఉందన్నారు. కార్యక్రమంలో లేబాక నాగేంద్ర, సయ్యద్ అమీర్, కలీం, ఆర్ముగం విశ్వనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివ, వేణు, రామచంద్రారెడ్డి, చెన్నయ్యగారిపల్లె ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల బలోపేతానికే సంక్షేమ పథకాలు

పెనగలూరు : పేద ప్రజల బలోపేతానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వ్యవసాయ సలహామండలి మండలాధ్యక్షుడు సిద్దవరం శ్రీనివాసులు రెడ్డి అన్నారు. సిద్దవరం సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్ సమ ప్రాధాన్యతను ఇస్తూ ఆర్థికంగా బలోపేతం చేసేందుకే ఈ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్ జగన్ గెలుపు కోసం పనిచేయాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో సిద్దవరం ఉప సర్పంచ్ సూరే సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి రామ్మోహన్ రెడ్డి, మారంరెడ్డి శ్రీనివాసులు, చిన్నబ్బి, సచివాలయ సిబ్బంది, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి


పెనగలూరు: సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులు రెడ్డి

కేంద్ర పథకాలపై అవగాహన అవసరం

సిద్దవటం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలకు అవగాహన అవసరమని జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మూలపల్లెలో గురువారం స్థానిక సర్పంచ్ ఆవుల వెంకట సుబ్బమ్మ అధ్యక్షతన మా సంకల్పం అభివృద్ధి చెందిన భారతదేశం అనే కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి జెడ్పీటీసీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్, వ్యక్తిగత మరుగుదొడ్లు, రైతు రుణమాఫీ, పక్కాగృహాలు, సబ్సిడీతో గ్యాస్ వంటి 17 రకాల పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ నాగభూషణం, ఈఓపీఆర్‌డీ బి. పులిరామ్‌సింగ్, పి. కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వెంకటేష్, స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభాకర్ ఇండియన్ డిస్ట్రిబ్యూటర్ సి.వి.సుబ్బారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ఎంపీడీఓ హైదర్‌వలిలు అన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం వీక్షిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా చిట్లూరు, నీలకంఠ్రావుపేట గ్రామాల్లోని గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలు ప్రజల కోసం ప్రవేశపెట్టిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినోద్‌కుమార్, ఈఓపీఆర్‌డీ ఉషారాణి, అన్ని శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రమాద నివారణ చర్యలను పాటించండి

రాజంపేట : ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు ప్రమాద నివారణా చర్యలను పాటించాలని రాజంపేట ఎంవీఐ బి.వినోద్‌కుమార్ అన్నారు. గురువారం రాజంపేట - రైల్వేకోడూరు రహదారిలోని పట్టణ శివార్లలో ప్రైవేటు వాహనాలను ఆర్టీసీ డిపో మేనేజరు గుండాల రమణయ్యతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అనేక చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. ప్రధానంగా వాహనదారులు ఎంవీఐ చట్ట ప్రకారం పాటించాల్సిన నియమ, నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. రోడ్డు పన్నును సకాలంలో చెల్లించుకోవాలన్నారు. కడప - రేణిగుంట హైవేలో ప్రమాదస్థలాలను గుర్తించి నివారణ చర్యలను పోలీసు, రవాణశాఖలు సంయుక్తంగా చేపట్టడం జరిగిందన్నారు. రికార్డులు సరిగ్గాలేని పది వాహనాలకు రూ.50 వేలు జరిమానా విధించామన్నారు. రాజంపేట డిపో మేనేజరు రమణయ్య మాట్లాడుతూ రాజంపేట నుంచి రైల్వేకోడూరు రహదారిలో ప్రైవేటు వాహనాలు జోరు అధికంగా ఉందన్నారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమన్నారు. ప్రజలు ఆర్టీసీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రవాణాశాఖ, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజసేవలో ఎల్లపుడూ 'మేడా' ముందంజ


ఫిక్స్‌డ్ బాండ్లను అందచేస్తున్న ఎమ్మెల్యే సోదరుడు మేడా మధురెడ్డి

రాజంపేట : సమాజసేవలో ఎల్లప్పుడూ టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు మేడా రామకృష్ణారెడ్డి తనయులు అయిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంఆర్‌కెఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డితో పాటు తాను ముందంజలో ఉంటామని ఎమ్మెల్యే సోదరుడు మేడా మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం కోనాపురానికి(సోమశిల ముంపుగ్రామం) చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నూకా శంకర్‌రెడ్డి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మేడా భవన్‌లో ఫిక్స్‌డ్ బాండ్లను బాధితుని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సింగల్‌విండో అధ్యక్షుడు పాలగిరి సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నూకా శంకర్‌రెడ్డి తదితర మండల స్థాయి ముఖ్యనేతలు పాల్గొన్నారు.

'భూ హక్కుల చట్టాన్ని రద్దుచేయాలి'

రాయచోటి అర్బన్ : ప్రజల ఆస్తులకు భద్రతలేని భూహక్కుల చట్టం - 2023ను వెంటనే రద్దుచేయాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద భూహక్కుల చట్టంను రద్దుచేయాలన్న డిమాండ్‌తో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణసంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వర్, అంబేడ్కర్ సేన ప్రధాన కార్యదర్శి పల్లం తాతయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు విశ్వనాథనాయక్, ఎమ్మార్పీఎస్ రాష్ట్రనేత రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన ఈ చట్టం అమలులోకి వస్తే ఇప్పటి వరకు భూములకు ఉన్న 30 రకాల రికార్డులన్ని రద్దయిపోయి వాటి స్థానంలో ఒకేఒక టైటిల్ రిజిస్టర్‌ను రెవెన్యూ అధికారులు తయారు చేస్తారన్నారు. దీనినే భూమిపై ఆఖరుహక్కుగా ప్రభుత్వం నిర్ధారిస్తుందన్నారు. పలుకుబడి ఉన్న వ్యక్తుల చెప్పుచేతల్లో నడుచుకునే అధికారవ్యవస్థ కారణంగా బలహీనుల భూములన్నీ ఉన్నతవర్గాల చేతుల్లోకి వెళ్లిపోతాయంటూ చెప్పారు. ప్రభుత్వం కనుసన్నల్లో జిల్లాకు ఒక్కటి మాత్రమే నడిచే ట్రిబ్యునల్ మాత్రమే ఆస్తుల హక్కులను నిర్ధారిస్తాయని, అక్కడ న్యాయం జరగకపోతే హైకోర్టును ఆశ్రయించవలసి వస్తుందన్నారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన న్యాయ వ్యవస్థ నిబద్ధతనే అవమానపరుస్తూ రెవెన్యూ అధికారులని న్యాయమూర్తులుగా గుర్తిస్తున్న భూహక్కుల చట్టం - 23 సమాజానికే పెద్ద ప్రమాదమన్నారు. అనంతరం బంజారా సంఘం నేత శంకర్ నాయక్, వడ్డెర విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతిశంకర్, ఉపాధ్యక్షుడు రెడ్డెయ్యలు ప్రసంగించారు. కార్యక్రమంలో బంగారు వ్యాపారుల సంఘం నేత అక్బర్‌అలీ ఖాన్, రజక సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాజ, ఎమ్మార్పీఎస్ నేతలు రెడ్డెయ్య, లక్షుమయ్య, కక్షిదారులు పాల్గొన్నారు.

అభివృద్ధే అజెండాగా పురపాలన



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ మర్రి రవి

రాజంపేట : అభివృద్ధి అజెండాగా పురపాలన కొనసాగిస్తున్నామని రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అన్నారు. గురువారం కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన రీతిలో పారిశుధ్య పనులు చేస్తున్నామన్నారు. అలాగే తాగునీటి సరఫరా, వీధిలైట్లు, డ్రైనేజీ వ్యవస్థను సరైన రీతిలో నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలోని పైపులైను లీకేజీ మరమ్మతులను యుద్ధప్రాతిపదకన చేపట్టేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మున్సిపాలిటీకి 90 మంది పీహెచ్ వర్కర్లను, 78 మంది నాన్ పీహెచ్ వర్కర్లను, 1 డేటా ప్రాసెసింగ్ ఆపరేటర్ పోస్టులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఏపీసీఓ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రతిపాదనలను పంపామన్నారు. రోడ్డు సౌకర్యంలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న స్థానికులకు కోరిక మేరకు సాయినగర్ - గొల్లపల్లె రోడ్డును నిర్మించనున్నట్టు తెలియజేశారు. పారిశుధ్య సామగ్రి కొరత లేకుండా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో వీధిలైట్ల నిర్వహణ చేపట్టిన ఈఈఎస్ఎల్ వారి కాలపరిమితి ముగిసిందని, ఇప్పుడు పురపాలక సంఘమే నిర్వహిస్తోందన్నారు. రాయచోటి రోడ్డులోని కంపోస్టు యార్డు(ఎస్ఆర్‌పాళెం)లో బోరు సౌకర్యం కల్పిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనరు జనార్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు, వివిధ శాఖ అధికారులు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

విద్య కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

రాయచోటి అర్బన్ : పాలకులు అనుసరిస్తున్న విద్య కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వినోద్, సహాయ కార్యదర్శి ఎం.అంకన్నలు విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాయచోటిలోని ఎన్‌జీఓ హోంలో ఉమ్మడి కడప జిల్లా పీడీఎస్‌యూ మహాసభలను నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి ఆ సంఘం నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానం - 2020 విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేయడంతోపాటు రాష్ట్రాల ఫెడరల్ హక్కులను కాలరాస్తోదంటూ చెప్పారు. ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు ఊసేలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తున్నారన్నారు. విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులంతా ఐక్యంగా పోరాటం చేయాలంటూ కోరారు. మహాసభల్లో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర, నేతలు శ్రీనాథ్, గణేష్, పృథ్వీ, లోకేష్, వాసుదేవనాయక్, నిరంజన్, లోకేష్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు


మాట్లాడుతున్న పశు వైద్యాధికారులు

రాజంపేట రూరల్ : మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలను పొందవచ్చని రాష్ట్ర గొర్రెలు, మేకల శిక్షణా సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి తెలియజేశారు. స్థానిక డివిజనల్ పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో గురువారం గొర్రెలు, మేకలు పెంపకందారులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ప్రశాంతిలు గొర్రెలు, మేకలు పెంపకందారులకు అధిక లాభాలు పొందే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బలహీన వర్గాల అభివృద్ధికి శిక్షణలతో పాటు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎర్రంశెట్టి విజయభాస్కర్, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు కె.ప్రతాప్, పశు వైద్యులు శరత్‌రెడ్డి, జీవీఓ ఎం.వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు గురజాడ

నందలూరు(రాజంపేట) : సంఘ సంస్కర్త, నవయుగ వైతాళికుడు, మహాకవి గురజాడ వెంకట అప్పారావు రచించిన దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా అనే దేశభక్తి గేయాన్ని అన్ని దేశాలు పాడుకునేలా చేశారని వక్తలు కొనియాడారు. గురజాడ 108వ వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, గీత, రమణమ్మలు ఈ కార్యక్రమం జరిపారు. నాటి సమాజంలోని కన్యాశుల్కాన్ని, బాల్య వివాహాలను నిరసిస్తూ రచనలు చేసి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన గురజాడ మనకు చిరస్మరణీయులని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్ నాగేంద్రప్రసాద్, శిల్పి ఆనందాచారి, లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, విజయకుమారి, మస్తాన్, జీవీ రమణ, జ్యోతి ప్రియ, ఆర్‌వి రమణమ్మ, షాకీర్ హుస్సేన్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై నానో యూరియా

సిద్దవటం : మండలంలోని టక్కోలి, వంతాటిపల్లి రైతు భరోసా కేంద్రాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డ్స్, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూరియా కేవలం 5 బస్తాలే ఉన్నాయని, 14.35.34, యూరియా ఎరువుల కోసం వెంటనే ఆన్‌లైన్‌లో ఇండెంట్ పెట్టాలని సూచించామన్నారు. ఇఫ్కో కంపెనీ నానో యూరియా ఎన్ఎఫ్ఎస్ఎం స్కీమ్ కింద 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. ముందుగా రైతులు పూర్తి ధరకు ఎరువులు కొంటే సబ్సిడీని డీబీటీ ద్వారా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు పేర్కొన్నారు. అలాగే ప్రతి రైతు ఈ - పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తోటివారి అభివృద్ధికి కృషిచేద్దాం

చిట్వేలి : క్షత్రియ సంఘం సభ్యులతోపాటు సామాజికాభివృద్ధికి దోహదం చేసేలా మన చర్యలు ఉండాలని క్షత్రియ సంఘం నేతలు పేర్కొన్నారు. గురువారం పాత చిట్వేలిలో వెలసిన వీరభద్రుడి ఆలయ ప్రాంగణంలో జరిగిన క్షత్రియ కార్తీకమాస ఐక్యత సమావేశంలో క్షత్రియ సంఘం నేతలు పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు, శ్రీనివాసులరాజు, శివకుమార్‌రాజు, హేమనవర్మ, కె.శివకుమార్‌రాజు, సుధాకర్‌రాజు, ప్రతాప్‌రాజు, వీరాంజనేయరాజు, నాగరాజులు పాల్గొన్నారు.

ధార్మిక సమ్మేళనాన్ని విజయవంతం చేయండి


సమావేశంలో మట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

వీరబల్లి (రాయచోటి టౌన్) : డిసెంబర్ నెలలో నిర్వహించే హిందూ ధార్మిక సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ ధార్మిక రాష్ట్ర ధర్మ ప్రచారక్ సాయిరాం కోరారు. గురువారం వీరబల్లె మండలం ఓదివీడు శ్రీ శివరామాంజనేయ స్వామి ఆలయ సముదాయంలో సమరసత సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ధార్మిక సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మం అత్యంత పురాతనమైనదన్నారు. ప్రతి గ్రామంలో ఆయా గ్రామ దేవాలయాలే కేంద్రంగా భజన, సంకీర్తనలు, సామూహిక హారతులు నిర్వహించాలని చెప్పారు. ధార్మిక సమ్మేళనంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని చెప్పారు. మారుమూల ఎస్సీ, ఎస్టీ గ్రామాలలో టీటీడీ ఆర్థిక నిధులతో ఇప్పటి వరకు 822 ఆలయాలు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కన్వీనర్ శ్రీధర్, జిల్లా ప్రభుత్వాల సంబంధాల ప్రముఖ్ వెంకటరణరెడ్డి, జిల్లా సహ సంస్కృతి ప్రముఖ్ హరిబాబు, జిల్లా ప్రచాకరులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే కఠిన చర్యలు

రాయచోటి టౌన్ : అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం పర్యవేక్షక ఇంజనీరు శ్రీనివాస బాబు హెచ్చరించారు. గురువారం ఆయన రాయచోటి విద్యుత్‌శాఖ అధికారులతో కలసి ఆకస్మికంగా 186 సర్వీసులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో అధిక లోడు క్యాటగిరీ - 1, 2లను సర్వీసులు 5 కిలో వాట్స్‌కు రూ.9600లు, కేటగిరీ 2లో 68 కిలో వాట్స్‌కు రూ.1,90,400లు అలాగే మాల్ ప్రాక్టీస్‌కు సంబంధించి నాలుగు సర్వీసులకు ఒక్కో కేటగిరీకి రూ.10,000లు జరిమాన విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా అధిక లోడు వినియోగిస్తే కఠిన చర్యలతోపాటు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

సమయం పాటించాలి

ఓబులవారిపల్లె : ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలలకు చేరుకొని డ్రాప్ ఔట్స్ లేకుండా చూసుకోవాలని ఎంఈఓ పద్మజ పేర్కొన్నారు. గురువారం ముక్కవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈఓ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బీ గ్రేడ్ విద్యార్థులను ఏ గ్రేడ్ విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఓపెన్ ఫోరం


మాట్లాడుతున్న ఉపాధి పీడీ మద్దిలేటి

చిన్నమండెం: మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో గురువారం ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి అధ్యక్షతన ఉపాధి హామీ ఓపెన్ సమావేశం సజావుగా జరిగింది. 01.04.2022 నుంచి 31.03.2023 వరకు 1193 పనులకు గాను రూ. 10,86,94,116 ఖర్చు చేయడం జరిగింది. 13 గ్రామ పంచాయతీలకు గాను మస్టర్లలో తప్పులు, ఎంబుక్‌లలో తేడాలు తప్పులు కొన్ని పంచాయతీలలో మామిడిమొక్కలు చనిపోయినట్లు గుర్తించారు. ఈ సమావేశంలో రాజంపేట ప్రిసైడింగ్ అధికారి ప్రతాప్, రాయచోటి ఏపీడీ రవికుమార్, ఏపీఓ రవిప్రతాప్, ఎంపీడీఓ దివ్య, ఎస్ఆర్‌పీ చంద్రమోహన్, ఏపీఓ మాధవి, జేఈ హరూన్‌బాషా, హౌసింగ్ ఏఈ రాజేశ్వరి, ఈజీఎస్ సిబ్బంది, ఎస్ఎస్ఏఏటీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

సంబేపల్లె : రెండురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వల్లపు అన్నయ్య (45) కుటుంబానికి గురువారం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డిల చేతులమీదుగా వైఎస్సార్ బీమా అందజేశారు. దేవపట్ల గ్రామం, గంగన్నగారిపల్లికి చెందిన మృతుడు అన్నయ్య అంత్యక్రియలు నిమిత్తం ఆయన భార్య రెడ్డమ్మకు రూ. 10 వేలు వైఎస్సార్ బీమాను వారు అందజేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ బీమా కింద ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ. 5 లక్షలు అందిస్తుందన్నారు. అందులో భాగంగానే మొదట రూ. 10 వేలు తదుపరి రూ. 4.90లక్షలు అందజేస్తామన్నారు.

జనవరిలోపు బస్టాండ్ పనులు పూర్తి

లక్కిరెడ్డిపల్లె : జనవరిలోపు పనులు పూర్తి చేసి బస్టాండ్‌కు బస్సులను మళ్లిస్తామని రాయచోటి ఆర్టీసీ డిపో మేనేజర్ ధనుంజయ పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని ఆర్టీసీ బస్టాండ్‌కు రూ. 41 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న లక్కిరెడ్డిపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రహరీ, ప్లాట్‌ఫాం, మరుగుదొడ్ల పనులు చేపట్టి సంక్రాంతి పండుగకు ఆర్టీసీ బస్సులను బస్టాండ్‌కు మళ్లిస్తామని తెలిపారు. 20 సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న బస్టాండ్ పనులు వేగవంతం చేసి ప్రయాణీకులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

రాయచోటి అర్బన్ : శిబ్యాల గ్రామం అన్నంరాజుగారిపల్లెలో లబ్ధిదారులకు యండపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి జ్యోతి ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు ఉచితంగా పరీక్షలు చేసి అందజేస్తున్న కంటి అద్దాలను సక్రమంగా వినియోగించుకోవాలంటూ కోరారు. కంటి సమస్యలు ఉన్నవారంతా తప్పక పరీక్షలు నిర్వహించుకుని ఉచితంగా కంటిఅద్దాలు పొందాలంటూ సూచించారు. కార్యక్రమంలో యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి, శిబ్యాల ఏఎన్ఎం సరస్వతి, సచివాలయం సీహెచ్‌ఓ శిరీష, ఏఎన్ఎం అంజనమ్మ, ఆశా కార్యకర్త రెడ్డెమ్మ పాల్గొన్నారు.

ఆలయంలో వేలంపాట

సంబేపల్లె : దేవరాయ నల్లగంగమ్మ ఆలయంలో వ్యాపార హక్కుల కోసం బహిరంగ వేలంపాటను గురువారం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. టెండర్లు పాడేందుకు పెద్ద సంఖ్యలో వ్యాపారులు పాల్గొన్నారు. వేలంపాటలో పూలహారాలు రూ. 1.20 లక్షలు, టెంకాయలు రూ. 3.60 లక్షలు, శీతలపానీయాలు రూ. 57 వేలు, ల్యామినేషన్ ఫోటోలు రూ. 21 వేలు, తలనీలాలు రూ. 47 వేలు, మాంసం కటింగ్ రూ. 71 వేలకు వేలంపాటలో పలువురు దక్కించుకున్నారు. టెండర్ దక్కించుకున్నవారు మూడోవంతు నగదును ఆలయ ఖాతాలో జమచేసినట్లు అధికారులు తెలిపారు.